చేయించానని చెప్పాడతను. ఆ మరునాడే ఊరికి బయల్దేరాడు గోవిందం.

కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూలు వెళ్లేదారిలో.. తాడూరు కంటే ముందే రోడ్డునుంచి ఐదు కిలోమీటర్ల లోపలికి ఉంటుంది గోవిందం స్వగ్రామం.

కల్వకుర్తికి జేరుకునేసరికి మధ్యాహ్నమైంది. అక్కడ లంచ్ చేసి మరో బస్సు, ఆ తరువాత షేర్ ఆటో ఎక్కి ఊరికి చేరుకున్నాడు. నేరుగా ఆచారి ఇంటికి వెళ్లి, అతణ్ని తీసుకొని తమ ఇంటికి వెళ్లాడు.

ఐదు వందల గజాల స్థలంలో కట్టిన చిన్న సింగిల్ బెడ్‌రూం, హాలూ, కిచెనూ ఉన్న ఇల్లది. ముందు ఖాళీ జాగానే ఎక్కువుంది. గోవిందం వాళ్ల నాన్న పక్క ఊర్లోని హైస్కూల్లో అటెండరుగా పనిచేస్తూ.. రిటైర్మెంట్ డబ్బులతో కట్టుకున్నాడు దాన్ని.


''అరే గోవిందూ! బావున్నావురా!? ఇల్లు అమ్ముతున్నవంట గద. నిన్ననే ఆచారి జెప్పిండు'' అన్నాడు పక్కింట్లో ఉన్నతను.. గోవిందాన్ని చూస్తూనే!

''అవును మామా! అమ్ముతున్న'' బదులిచ్చాడు గోవిందం.

''కొననీకె శానమందున్నరు. తొందరపడి తక్కువ ధరకు అమ్మొద్దు. బాగా సోంచాయించుకొని రేటు జెప్పు''.

''సరే మామా!''.

''అవ్‌నా గోవిందూ! నేనీ సంగతి ఒకరిద్దరికి చెప్పిన్నో లేదో.. ఐదారుమంది నా ఎనుక పడ్డరు. రేటెం




తనో జెప్పమని'' అన్నాడు ఆచారి.

తన ఇంటికి డిమాండు బాగానే ఉందని తెలిసి.. సంతోషంతో ఏం మాట్లాడ లేకపోయాడు గోవిందం.

''ఎవరైనా అడిగితే.. ఆరేడు పైన్నే జెప్పు'' తిరిగి తనే అన్నాడు ఆచారి.

''అంతనా?'' ఆశ్చర్యపోయాడు గోవిందం.

''అవును మల్ల! ఏమనుకుంటున్నవు. నడూళ్ల ఇంత పెద్ద జాగా అంటే మాటలా!? తెలంగాణొచ్చినంక నీళ్ల కరువు పోయి, భూముల రేట్లు చాన పెరిగినయి. మనూళ్లె ఎకరం ఎంతనుకుంటున్నవు? ముప్పయి, నలభై లక్షల పైన్నే నడుస్తున్నది''.

''అమ్మో! అంతరేటా?'' ఆశ్చర్యంతో అరిచినంత పనిచేశాడు గోవిందం. తనకు తెలిసినంతలో అప్పుడు ఎకరం ధర.. పదిహేనూ ఇరవై వేల వరకు ఉండేది. ఇంతలోనే ఎంత మార్పు?!

ఆ రాత్రి ఓ క్వార్టర్ బాటిల్ విస్కీ తెప్పించుకుని.. స్నేహితులిద్దరూ తాగుతూ ఊరి విశేషాలూ, కుటుంబ విషయాలూ మాట్లాడుకోసాగారు. ఇంతలో గోవిందం ఫోన్ మోగింది. అతని డిగ్రీ క్లాస్‌మేట్ కాల్ చేస్తున్నాడు.

''గోవిందూ! మన డిగ్రీ క్లాస్‌మేట్స్ అందరం కలిసి.. వచ్చే ఆదివారం ఆలమ్నీ కండక్ట్ చేస్తున్నాం. మనవాళ్లంతా వస్తున్నారు. పెద్దఎత్తున చేస్తున్నాం. ఒక్కొక్కరి దగ్గర్నుంచి ఐదు వేలు కలెక్ట్ చేస్తున్నాం. నీవు తప్పకరావాలి. అలాగే డబ్బు కూడా పంపాలి''.

''సరేసరే!'' అని ఫోన్ పెట్టేశాడు గోవిందం.

''ఏందట?'' అడిగాడు ఆచారి.

''ఆలమ్నీ.. అంటే పూర్వవిద్యార్థుల సమ్మేళనం. మా డిగ్రీ క్లాస్‌మేట్స్ అందరమూ అప్పుడప్పుడిలా కలుసుకుంటూ ఉంటాం'' .. అని కాసేపు ఆగి..

''అవునూ! మనం దాదాపు ముప్పై మందిమి మనూరి బడిలో ఫస్ట్‌క్లాసు నుంచి ఫిఫ్త్ వరకూ కలిసి చదువుకున్నాం. వాళ్లంతా ఎక్కడెక్కడ ఉన్నారో నీకేమైనా తెలుసా!?''.

''చానామంది తెల్సు. ఇరవైమంది దాకా ఈ ఊళ్లనే ఉన్నరు. నీలాగ ఐదారు మంది హైదరాబాదులున్నరు. ఇంక నలుగురైదుగురు చచ్చిపోయిండ్రు!''.

''ఆ గోపాల్ రెడ్డీ, యాదయ్యా, పర్వతాలూ.. ఇప్పుడున్నరా'' ఆసక్తిగా అడిగాడు గోవిందం.

''ఉన్నరు. రేపు కలుద్దమా?''.

''కలవడం అంటే ఒకరిద్దరితో కాదు. మొత్తం మన బ్యాచ్ పూర్వ విద్యార్థులం అందరం.. ఈ ఇంట్లోనే కలుసుకుందం. వీలయితదా''.

''ఉత్తగ రమ్మంటె ఎంత మందొస్తరో కానీ, దావతిస్తున్నమంటే అందరొస్తరు'' నవ్వుతూ అన్నాడు ఆచారి.

''అరేంజ్‌మెంట్స్ నీవు చేస్తానంటే.. దావతియ్యడానికి నేను రెడీనే!''.. తనూ నవ్వుతూ అన్నాడు గోవిందం.

''నిజంగనే అంటున్నవా!?''.

''నిజమే ఆచారీ! రేపుదయమే పోయి వీలైనంత మందిని కలిసి చెప్పుదం. అట్లనే ఇల్లు సంగతి కూడ చెప్పొచ్చు''.

''దావతంటే చికెనో, మటనో పెట్టాలి. మనం చికెన్ పెడ్దాం!''.

''చికెన్‌తోపాటు గుడ్లు, అరటిపండ్లు కూడా తెప్పించు. స్వీటుకూడా! ఖర్చుకు వెనుకాడకు. మనం ఇష్టంగా పెట్టాలె. వాళ్లు తృప్తిగ తినాలె!''.

* * *

మరునాడు ఉదయం తొమ్మిది గంటల సమయంలో యాదయ్య ఇంటికి వెళ్లారిద్దరు.

పెరిగిన గడ్డంతో, మాసిన బట్టలతో, శుష్కించిన దేహంతో.. తన వయసుకన్నా పదేళ్ల పెద్దవానిలా ఉన్నాడు యాదయ్య. తను చిన్నప్పుడు చూసిన యాదయ్యలోని ఒక్క చిన్న పోలిక కూడా.. ఇప్పుడు ఏ కోశానా కనిపించక ఆశ్చర్యచకితుడయ్యాడు గోవిందం.

''అరే యాదీ! నేను స్కూలు అటెండరు చిన్నయ్య కొడుకును గోవిందునురా! మనం ఈ ఊళ్లనే ఐదో తరగతి దాకా కలిసి సదువుకున్నంరా! గుర్తుపట్టినవా!?'' అంటూ ఆప్యాయంగా పలకరించాడు గోవిందం.

''అరే గోవిందూ నువ్వా!? ఏం బాగరా.. గిట్లున్న! నేనింకా నీకు గ్యాపకం ఉన్నందుకు మంచిగనిపిస్తున్నదిరా! సదువుకున్నందుకు నీవంత బాగున్నవు. సదువుకోనందుకు నా కిస్మత్ గిట్లుంది'' గొంతులోని అంతులేని విషాదం స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

''అన్ని విషయాలూ మా ఇంటికాడ మధ్యాహ్నం మాట్లాడుకుందాం.. మన క్లాస్‌మేట్లందరికీ దావతిస్తున్న. తప్పకరా!''.

''నన్నీ ఊళ్ల దావతుకు పిల్చెటోడే లేడు. నీవంత మంచిగ ఇంటికొచ్చి పిల్చుతుండవు. రాకుండుంటనా.. తప్పకొస్తా!'' అన్నాడు.

అక్కడినుంచి గోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లారు గోవిందం, ఆచారి. గోపాల్‌రెడ్డి ఇల్లును చూసేసరికి ఆశ్చర్యంతోపాటు విచారం కూడా కలిగింది గోవిందానికి. అప్పట్లో ఆ ఊరికే గర్వకారణంగా ఉండేదా ఇల్లు. ఇంటినిండా మందితో ఎప్పుడూ కళకళలాడుతూ.. గొప్పగా ఉండేది. ఇప్పుడేమో శిథిలావస్థలో దయనీయంగా ఉంది.

గోపాల్‌రెడ్డి తండ్రి ఆ ఊరికి పోలీస్ పటేల్. పైగా భూస్వామి. ఆయన పేరు చెబితేనే ఊరందరికీ హడల్. అందుకే స్కూలులో పిల్లలతోపాటు టీచర్లు కూడా గోపాల్‌రెడ్డిని ప్రత్యేకంగా చూసేవారు. ఖరీదైన దుస్తులలో యువరాజులా ఉండేవాడతను. అటువంటి గోపాల్‌రెడ్డి ఇప్పుడు ఆ శిథిలమైన ఇంటి అరుగుపై ఒక్కడే కూర్చుని.. బీడీ తాగుతూ శూన్యంలోకి చూస్తున్నాడు.

''గోపాలన్నా.. బాగున్నావే! నేను గోవిందును గుర్తున్ననా!?''.

''గుర్తుపట్టిన గోవిందూ! నా బాగు ఏం జెప్తరా.. చెప్పుకొంటే ఇజ్జత్ పోతది. కూసోండి కూసోండి!'' అంటూ ఇంకో అరుగును చూయించాడు.

కూర్చున్నారిద్దరూ.

''ఇల్లు అమ్ముతున్నవంట గదరా!''.

''అవునన్నా! పిల్లలిద్దరు బయట దేశంలున్నరు. భార్య చనిపోయినంక ఒంటరిగ ఉండలేక.. ఓల్డేజ్ హోమ్‌ల జాయినైన. అందుకే ఇల్లు అమ్ముదమని అనుకుంటున్న!''.

''నిజమేలే! ఎవరుండక పోతే ఇల్లు పడావు పడ్డది. అమ్ముకుంటనే మంచిది. నీలాకనే నా భార్య చనిపోయినంక నా బతుకు గూడ ఆగమాగమైపోయింది. ఎంతైనా పెండ్లం లేని మొగోని బతుకు కుక్క బతుకేరా!? నాక్కూడా నీలాకనే ఏ ఓల్డేజ్ హోమ్‌లోనో ఉండాలనుంది. కానీ నా కొడుకులు ఏమంటలేరు!.

''ఎక్కడున్నరు వాళ్లు''.

''ముగ్గురు కోడుకులూ హైదరాబాద్‌లనే ఉన్నరు. అంత బానే ఉన్నరు కానీ, పోటీలు పెట్టుకొని తండ్రిని పట్టించుకోరు'' అన్నాడు ఆచారి.

''మరి భోజనం!?''.

''రైస్ కుక్కర్ల అన్నం వండుకుంట. కూర ఎవరైన తెచ్చిస్తరు. మన ఆచారి కూడా అప్పుడప్పుడు తీసుకొస్తడు. ఇప్పుడైతే కాలూ చేయీ ఆడుతంది కాబట్టి ఈ మాత్రం జరుగుతున్నది. రేపు మంచాన పడ్తె ఎట్లనో అనే ఫికరుతోనే సస్తూ బతుకుతున్నరా!''.

గుండె బరువైపోయింది గోవిందానికి. ఏమని ఓదార్చాలో అర్థం కాలేదు. చివరికి తానిస్తున్న దావత్ గురించి చెప్పాడు. వస్తాడో రాడో అనే సందేహంతోనే.. రమ్మని ఆహ్వానించాడు.

''నా చిన్ననాటి స్నేహితులు మీరు. మీతో సెప్పుకోవడానికి సిగ్గేంది కానీ, కడుపు నిండా మంచి భోజనం చేయక చానా రోజులైందిరా!'' అని అంటుంటే.. గోపాల్ రెడ్డి కళ్లల్లో కన్నీళ్లు సుడులు తిరిగాయి.

అది గమనించిన ఆ ఇద్దరికి కూడా కళ్లు చెమర్చాయి. అట్నుంచి పర్వతాలు ఇంటికి వెళ్లారు.